రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బయ్యారం, జనవరి 19 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శుక్రవారం బయ్యారంలో జరిగింది. జగ్నతండాకు చెందిన గుగులోత్ లచ్చు పని నిమిత్తం బయ్యారం నుంచి కొత్త పేటకు బైక్‌పై వెళ్తున్నాడు. గంధంపల్లి ఎస్‌బీహెచ్ వద్ద అధిక లోడ్‌తో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీ కొట్టడంతో లచ్చుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కేసముద్రం, జనవరి 19 : మండల కేంద్రంలోని పేదలు, యాచకులకు పీపుల్స్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నజ్జు, సత్యనారాయణ, హరి, గఫార్, సారంగం పాల్గొన్నారు.

22న హనుమ విగ్రహం ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : మండలంలోని ఈదులపూసపల్లి గ్రామంలో ఈ నెల 22న మధ్యాహ్నం 2.30గంటలకు 16 అడుగుల పంచముఖ హనుమ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు అర్చకుడు శ్రీపాద సంతోష్ కృపాకరాచార్యులు శుక్రవారం తెలిపారు. విగ్రహ ఆవిష్కరణకు ముందు గ్రామంలో ఉదయం పూట శోభాయాత్ర, యజ్ఞం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు.

ఉమ్మడి జిల్లాలను జోన్లుగా ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : ప్రతి ఉమ్మడి జిల్లాను ఒక జోన్‌గా ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. తెలంగాణలో ఏర్పడిన నూతన ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బదిలీల, పదోన్నతుల విషయంలో పలు రకాల జీవోల వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది అవుతున్నదని, వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేసి న్యాయం చేయాలని కోరారు.

వరిలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి

–ఇన్‌చార్జి ఏడీఏ శోభన్‌బాబు

నర్సింహులపేట, జనవరి 19: వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ శోభన్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని వంతడపల గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన వరిని ఆయన పరిశీలించి మాట్లాడారు. కలుపు నివారణకు ఎకరానికి బెంథియోకార్బ్ 1.25 లీటర్లు లేక బుటాక్లోర్, సేఫనర్ 1.25 లీటర్లు గానీ అనిలోఫాస్ 0.5 లీటర్లు విత్తిన 8–10 రోజుల్లో, 25 కిలోల ఇసుకతో కలిపి పొలమంతా పలుచటి నీటిలో సమానంగా వెదజల్లాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ రైతులు నాగులు, వెంకన్న పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు

20వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

- గ్రీన్‌ల్యాండ్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి
- మున్సిపాలిటీలో విస్తృత పర్యటన

మహబూబాబాద్, జనవరి 19 : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 10, 19, 20 వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. 19, 20 వార్డుల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రహదారులు ఖాళీ ప్లాట్లలో చెత్తాచెదారం లేకుండా నిత్యం శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుధ్యం విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు నిత్యం సిబ్బందితో ఉంటూ పనులు చేయించాలన్నారు. 36 వార్డుల్లో ఎక్కడా పారిశుధ్య లోపం కనిపించొద్దన్నారు. నీటిని వృథా చేయొద్దని, ప్రజలందరికీ మున్సిపాలిటీ నీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. 10వ వార్డు పరిధిలోని ప్రమోద్ హోమ్స్ వద్ద కమిషనర్ ప్రసన్నారాణితో కలిసి గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారమే గ్రీన్‌ల్యాండ్ అనమతులు ఇచ్చినట్లు గుర్తించారు. గ్రీన్‌ల్యాండ్ చుట్టూ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని, ఏమైనా సందేహాలుంటే హైదరాబాద్ డీటీసీపీ అధికారులను సంప్రదించి వివరణ ఇస్తామని వరంగల్ ఆర్డీటీపీ చెప్పినట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వెంచర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనల ప్రకారం తీసిన గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీవో నవీన్‌కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, జవాన్ శ్రీను, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఫ్లై ఓవర్‌ను శుభ్రంగా ఉంచాలి

రైల్వే ఫ్లై ఓవర్‌ను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రహదారి నుంచి ఎన్‌హెచ్ 365 (కురవి రోడ్డు) వరకు ఫ్లై ఓవర్‌పై 60 మంది మున్సిపల్ కార్మికులు 6 ట్రాక్టర్లు, 5 ఆటోలతో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ ప్రసన్నారాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆర్వోబీపై మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు చోటులేకుండా మున్సిపల్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, గ్రీనరీని పెంచాలని సూచించారు. నెలలో రెండు సార్లు ఫ్లై ఓవర్‌పై పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త, పాత బజార్‌ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి, రాజేశ్, జవాన్లు శ్రీను, చిరంజీవి, కృష్ణ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో దరఖాస్తులు చేసుకోవాలి

తొర్రూరు, జనవరి 19: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వనజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ముస్లిం, క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, నాన్ మైనార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ అడ్మిషన్ పొందవచ్చన్నారు. 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో తొలుత వచ్చిన ముస్లింలకు అవకాశం ఉంటుందని, 6,7,8 తరగతుల్లో ఖాళీలు ఉంటే దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇస్తామన్నారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్ ఎంపీసీ, బైపీసీలో పదో తరగతిలో మెరిట్ ఆధారంగా, నాన్ మైనార్టీ కోటాలో లక్కీ డ్రాద్వారా ఎంపిక చేస్తారని అన్నారు. www.treistelangana.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7995057928 నంబర్‌లో సంప్రదించాలనారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- హాజరు కానున్న 3,300మంది విద్యార్థులు
- జిల్లాలో ఐదు కేంద్రాలు
- అన్ని కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా ప్రవేశం లేదు

మహబూబాబాద్ రూరల్, జనవరి 19 : నవోదయ ప్రవేశ పరీక్ష కోసం జిల్లాలో అధికారులు సర్వంసిద్ధం చేశారు. మొత్తం 3,300 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, ఐదు సెంటర్లను సిద్ధం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ఇన్విజిలెటర్లు, సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఏజెన్సీ, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకొనేలా ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి సెంటర్ వద్ద వైద్య సిబ్బందితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షతో సంబంధం లేని వారు కేంద్రాల వైపు వస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే ఉన్నతస్థాయి అధికారులు పరీక్షల నిర్వహణ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని, విద్యార్థులను వారి తల్లిదండ్రులు గంట ముందుగానే కేంద్రానికి తీసుకురావాలన్నారు.

ప్రవేశ పరీక్షకు సర్వంసిద్ధం

జిల్లాలో నేడు నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, అనంతారం ఆదర్శ పాఠశాల (పట్టణంలో), మరిపెడలోని సెయింట్ అగస్టీన్ హైస్కూల్, టీఎస్ మోడల్ స్కూల్, గూడూరులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పరీక్ష ఉంటుంది. పరీక్షలకు సంబంధించి ఏ సమస్యన్నా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి.

–డీఈవో రామారావు

సమష్టి కృషితో నియోజకవర్గ అభివృద్ధి

– పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 19: సమష్టి కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రాజేందర్‌రెడ్డితో కలిసి మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నాయకులందరి సమష్టి కృషితోనే పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగరేశామని, పాలకుర్తి మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి తమకు తెలియజేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు. ఎవరూ అధికార దుర్వినియోగానికి పాల్పడొద్దని, ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తున్న అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అందేలా కార్యకర్తలు వలంటీర్లలా పనిచేయాలన్నారు. నిరుద్యోగాన్ని తరిమికొట్టడమే ప్రధాన లక్ష్యంగా తమ సొంత నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంచు సంతోష్‌తో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చెరువు భూములను రక్షించాలి

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గూడూరు, జనవరి19 : మండల కేంద్రంలోని కోడిచెరువు శిఖం భూములను రక్షించాలని ఆయకట్టు రైతులు శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు పానుగంటి నర్సయ్య మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న కోడిచెరువు కింద ఆయకట్టు విస్తీర్ణం 350 ఎకరాలు ఉంటుందన్నారు. కొందరు అక్రమార్కులు శిఖం భూమిలో వ్యవసాయ బావులు తవ్వి, చెరువును పూడ్చి వ్యవసాయ క్షేత్రాలుగా మార్చారని, మరికొంతమంది చెరువులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. గతంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకు హద్దులు నిర్ణయించి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. చెరువును కాపాడి మచ్చర్ల, గూడూరు, బ్రాహ్మణపల్లి, ఏపూరు గ్రామాల ఆయకట్టు రైతులను కాపాడాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు జున్నూరు వెంకన్న, తోటకూరి సోమయ్య, బానోత్ రాజన్న, నూకల ఉపేందర్, ఇండ్ల హరీశ్, పానుగంటి వెంకటచారి, నూకల సురేందర్, భాషబోయిన ఐలయ్య, వెంకటయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

డోర్నకల్, జనవరి 19: పీఆర్‌టీయూటీఎస్ డోర్నకల్ మండల డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని ఎంపీపీఎస్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఆవిష్కరించారు. ఎంఈవో ఫూల్‌చంద్, మండల అధ్యక్షుడు సీతారాములు, నోడల్ అధికారి లక్ష్మా, ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రు క్మాంగదరావు, మండల ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు : మండలంలోని అయోధ్యపురంలో టీఎస్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను మండల అధ్యక్షుడు ఊక లక్ష్మయ్య ఆవిష్కరించారు. హెచ్ఎం భిక్షపతి, సంఘం మండల కార్యదర్శి వెంకట్వేర్లు, జిల్లా కార్యదర్శి బాలయ్య, హెచ్ఎంలు రవికుమార్, మంగీలాల్, సుజాత, రాముడు, పగడయ్య, వేణు, ఉపాధ్యాయులు గోపి, రవి, స్వామి, అనిల్, సంపత్, యాకూబ్ పాల్గొన్నారు.

కొత్తగూడలో..

కొత్తగూడ: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఆధార్ సొసైటీ ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర బాధ్యులు అంజయ్య, సారయ్య, సాయిలు, దేవదాస్ ఆవిష్కరించారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్, జనవరి 19: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు చివరి తేదీ ఫిబ్రవరి 6 అని, అర్హులందరూ నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వృద్ధ ఓటర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. అలాగే 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులు అందించాలన్నారు. మహబూబాబాద్, డోర్నకల్ ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీనాయక్

'వయోజన విద్య కో ఆర్డినేటర్లను విధుల్లో చేర్చుకోవాలి'

పెద్దవంగర, జనవరి19 : వయోజన విద్య కో ఆర్డిటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉమ్మడి మండల కో ఆర్డినేటర్ వాంకుడోత్ బాలాజీనాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామస్థాయి వయోజన విద్య(సాక్షర భారత్) కో ఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. గత ప్రభుత్వం తమను విధుల్లోంచి తొలగించిందని, నూతన ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమన్వయకర్తలు సాంబలక్ష్మి, భవాని, సునీత, యాకయ్య, సంధ్య, సురేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొర్రూరు, జనవరి 19: వడ్డేకొత్తపల్లిలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో కొన్ని గంటలపాటు అంతరాయం ఉంటుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరు, పెద్దవంగర మండలాల పరిధిలోని తొర్రూరు, ఖానాపురం, చెర్లపాలెం, హరిపిరాల, పోచంపల్లి, నాంచారి మడూర్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, వడ్డేకొత్తపల్లి, చిన్నవంగర, బొమ్మకల్లు సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మైనార్టీ ఒకేషనల్‌లో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

డోర్నకల్, జనవరి 19 : డోర్నకల్‌లో తెలంగాణ మైనార్టీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్), ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశానికి 18 నుంచి వచ్చేనెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజసుధ తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ మైనార్టీ 23, నాన్ మైనార్టీ 7, ఎంఎల్‌టీలో మైనార్టీ 23, నాన్ మైనార్టీ 7 సీట్లు ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం 6301750569, 8686920247 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీసీ కెమెరాలు అమర్చాలి

డోర్నకల్, జనవరి 19: ఆలయాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు సూచించారు. శుక్రవారం డోర్నకల్ పోలీసు స్టేషన్‌లో అన్ని మతాల పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయని, కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా స్వప్న

కురవి, జనవరి 19 : లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కురవి మండలం కంచర్లగూడెం గ్రామ ఉపసర్పంచ్ ధరంసోత్ స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ భీమా నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశంలో మహిళా విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. మహిళల హక్కుల కోసం భవిష్యత్‌లో రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్, గుగులోత్ హరినాయక్, రాష్ట్ర కో కన్వీనర్ గుగులోత్ భీమానాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కుటుంబానికి కేంద్రం పథకాలు

పెద్దవంగర, జనవరి19: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని బీజేపీ జిల్లా నాయకులు సాయిని ఝాన్సీ, రంగు రాముగౌడ్ అన్నారు. 'వికసిత్ భారత్' సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మోత్యాతండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, గిరిజనులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కేసముద్రం, జనవరి 19: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం సభ్యుడు మెరుగు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో రాంనర్సయ్య, సత్యనారాయణ, యుగేంధర్, యాదయ్య, కుమారస్వామి, ఐలేశ్‌కుమార్, పరమేశ్, నరేశ్, కీర్తి పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, హెచ్ఎంలు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కురవి, జనవరి 19 : వచ్చే నెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కురవి ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను కురవి కాంప్లెక్స్ హెచ్ఎం వాహిద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్ల విజయ్‌కుమార్, ఓదెల శివకుమార్, దైదా వెంకటేశ్వర్లు, మధుసూదన్, సింగం మనోహర్, బుక్క వీరేందర్, విజయ్ రాజ్, అడ్డగోడ నరేశ్, ప్రభాకర్, చేపూరి వెంకన్న, మాధవ్, వెంకట్రాజు, రచ్చ రాము, పూర్ణచందర్, పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

కురవి, జనవరి 19 : తమ హక్కుల సాధన కోసం లంబాడాలు ఉద్యమించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కో కన్వీనర్ గుగులోత్ భీమా నాయక్ అన్నారు. కురవి మండల కేంద్రంలో జిల్లా జనరల్ బాడీ సమావేశం శుక్రవారం బానోత్ శంకర్‌నాయక్, చందూలాల్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో లంబాడాలంతా ఏకమై బీజేపీని ఇంటికి పంపించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ఉదయ్ నాయక్, వీరన్న నాయక్, అంగోత్ శివాజీనాయక్, రాందాస్ నాయక్, రవీందర్ నాయక్, సేవాలాల్ నాయక్, లింగ్యా నాయక్, బాలు నాయక్, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న అమరలింగేశ్వరరావు

కేసముద్రం, జనవరి 19: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు అన్నారు. హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా కట్కూరి శ్రీనివాస్ అందించిన సహకారంతో మండల కేంద్రంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, చంద్రశేఖర్, యర్నం శ్రీరాములు, నర్సయ్య, చింత కరుణాకర్, సత్యనారాయణ, తాళ్లపల్లి రాజు, కొడకండ్ల ప్రభాకర్, మారం సమ్మిరెడ్డి, మడిపెద్ది వెంకటేష్, ఎర్రంశెట్టి అశోక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TO-LET

★HNK బాలసముద్రం LIC డివిజన్ ఆఫీస్ ప్రక్కన 1st ఫ్లోర్ 2000 Sft. ఆఫీసెస్, కమర్షియల్, BIG Family కి కిరాయికి ఇవ్వబడును. సంప్ర: సెల్: 9908117447

NTW-323115

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్; డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.

NT-319803

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.

NT-319415

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల వి